# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహిళలను కించపరిచేలా సామాజిక మాధ్యమాలలో ఎవరైనా పోస్టులు పెట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు.
- ❖ మెగా డీఎస్సీ లో ఇటీవల ఎంపికైన 15 వేల 941 మంది ఈరోజు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈ 28న ప్రసారమవుతుంది.
- ❖ రాష్ట్రంలోని పలు జిల్లాలలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

=====================

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణ కార్యక్రమాలను ఓ ఉద్యమంలా చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా గంజాయి, మాదక ద్రవ్యాలను కట్టడి చేస్తున్నామన్నారు. శాంతిభద్రతలు, సోషల్ మీడియా అంశాలపై శాసనసభలో ఈరోజు జరిగిన స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గంజాయి పండించినా, స్మగ్లింగ్ చేసినా అటువంటి వ్యక్తులపై కేసులతో పాటు ఆస్తులు సీజ్ చేసేందుకు కూడా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి సాగుని అరికట్టామని.. అయితే పొరుగు రాష్ట్రాల నుంచి కొంతమేర అక్రమంగా రవాణా అవుతోందన్నారు. మహిళలను కించపరిచేలా సామాజిక మాధ్యమాలలో పోస్టులు చేసినట్లయితే వాటిని తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

=====================

దేశానికి అధినేత అయినా గురువు వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిందేనని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో ఈరోజు ఏర్పాటు చేసిన బహిరంగ వేదికపై ఇటీవల ఎంపికైన 15 వేల 941 మంది మెగా డీఎస్సీ విజేతలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను

అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నవంబర్‌లో మరోసారి టెట్ నిర్వహించి వచ్చే ఏడాది మళ్లీ డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పారు. ఇక సమిష్టి కృషి వల్లే మెగా డీఎస్సీని సక్రమంగా నిర్వహించగలిగామని మంత్రి నారా లోకేశ్ పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

=====================

జీఎస్టీ తగ్గింపుతో 99 శాతం వస్తువుల ధరలు తగ్గడం చారిత్రాత్మకమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 109వ జయంతి కార్యక్రమంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతి చేతికి పని, ప్రతి పొలానికి నీరు అనే నినాదాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరళీకృత జీఎస్టీని తీసుకువచ్చి ఆత్మనిర్భరత అనే ఆలోచనను ఒక వేదికగా చేసుకుని స్వయం సమృద్ధి భారత్ కోసం ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=====================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్” పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా స్వావలంబన దిశగా పయనిస్తున్న భారత రక్షణ రంగంపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 105 సెకన్లు)

=====================

“స్వచ్ఛతా హి సేవ” కార్యక్రమంలో భాగంగా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా రెవిన్యూ అధికారి కె.చంద్రశేఖర రావు కలెక్టరేట్ కార్యాలయం పరిసర ప్రాంతాలను గ్రామస్తులతో కలిసి శుభ్రపరిచారు. అనంతరం ఉద్యోగులు గ్రామస్తులతో కలిసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా తమను తామే కాపాడుకోగలుగుతారని, ఇక మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కూడా కాపాడిన వారు అవుతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కనీసం ఒక గంట పాటు శుభ్రతా కార్యక్రమాలలో అక్టోబర్ 2 వరకు పాల్గొనాలని సూచించారు.

=====================

ఈశాన్య బంగాళాఖాతంలో విస్తరించి ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం పశ్చిమ దిశగా కదిలే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రానున్న 6 గంటల్లో మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలను ఆనుకుని వాయువ్య, పశ్చిమ మధ్య

బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ఫలితంగా రేపటి వర్ష సూచనలను వాతావరణ శాస్త్రవేత్త కరుణాసాగర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్ల)

=====================

మహిళల అభ్యున్నతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కాఫీ హౌస్ లో ఈరోజు 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మహిళా ఆరోగ్యం పట్ల పలు సూచనలు చేశారు. తల్లి బాగుంటే కుటుంబం బాగుంటుందని అలాగే మహిళ బాగుంటేనే సమాజం కూడా బాగుంటుందని ఆమె ఉద్ఘాటించారు. మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

=====================

=====================